# మచ్చలు

తెల్లవారింది. నిద్రనుంచీ మెలకువ వచ్చినా పక్కమీదనుంచి లేవాలని బుద్ధిపుట్టలేదు. రోజూ అంతే! ముందుగా లేచి పాపకూ, బాబుకూ పాలు కాచిపెట్టి, మా ఇద్దరికీ కాఫీ పెట్టి, వాళ్ళు లేచేసరికి ఏడుగంటలకంతా తయారుగా వుండాలి. రోజూ ఆ వేళకు 'ఏం, కాసేపు ఆలస్యమైతే' అనిపిస్తుంది. నాకు ఏ జబ్బో చేస్తే ఏమాతుం దేమిటి? అప్పుడెట్లా జరుగుతుంది? ఏం చేసుకుంటారు? అనుకుంటాను.

జబ్బుమాట గుర్తుకొచ్చేసరికి అప్రయత్నంగానే చేతివేళ్ళు చూసుకున్నాను. ఎడమచేతివేళ్ళకూ, కుడిచేతి వేళ్ళకూ నిన్న ఎంత భేదం వుందో ఇవాళా అంతే వుంది! ఈ మధ్యన ఏమంత తేడా రాలేదు...

కొంచెం వచ్చిందా?

ఏమో!

ఎడమచేతి వేళ్ళు సన్నగా వుంటాయి. కుడిచేతివేళ్ళు కణుపులదగ్గర కాస్త మొద్దుబారినట్టుగా మచ్చలతో వుంటాయి. వాటిని చూసి నాకు ఎప్పుడూ అనుమానం వస్తూ వుంటుంది-కుష్ఠువ్యాధి ఏమైనా ప్రథమదశలో వుందేమోనని. దానికీ ముందుగా కణుపులు మొద్దుగా అవుతాయని విన్నాను.

కుష్ఠువ్యాధి అంటే నాకు చాలా అసహ్యం. ఎక్కడ చూసినా ఆ చీదర మొహాలే యీ చిత్తూరు నిండా. అబ్బ తలచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. వీడికి వేలులేదు. దానికి ముక్కులేదు. వాడి చేతులనిండా పొడలాగా మచ్చలు! ఛీ ఛీ దేశంలో వుండే కుష్ఠు వాళ్ళకందరికీ అడుక్కోవటానికి ఈ వూరే దొరికినట్లుంది. ఆ దరిద్రపు రోగం వూరంతకీ అంటించడానికి! వీళ్ళందర్నీ కట్టగట్టి తగలేస్తే పీడా వదిలిపోతుంది.

అట్లా అంటే వూరుకోదు లోకం. సానుభూతి, సానుభూతి... ఏదీ నీ సానుభూతి? అని కేకలేస్తుంది.

నాకు లేదు సానుభూతి.

అందుకని నన్ను కూడా తగలేస్తారా?

ఏమిటో పాడు వేళ్ళు... యీ కుడిచేతివేళ్ళు... మొద్దుగా! యింతకీ కారణం ఆ వెధవ్వంటే! ఆవాలూ, పచ్చిమిరపకాయలూ పెటపెటలాడి ఈ చేతిమీదే చిందుతాయి. ఆవిరి ఎక్కడనుండీ బయటకొచ్చినా నా చెయ్యి అక్కడేవుంటుంది ఎలాగో. గంజి వార్చితే అదీ అయస్కాంతం దగ్గరికి పరుగెత్తుకొచ్చే ఇనుపముక్కలాగా నా చేతి మీదికే వస్తుంది. పాలు పొంగుతూవుంటే పాతగుడ్డ చుట్టుపక్కల్లో వుండదు గిన్నె దించటానికి. మొదట్లో చెయ్యి కాల్తుందని భయపడి, ఏం చెయ్యాలో తెలియక పాల పొంగునీ, గిన్నెనీ, పొయ్యినీ కూడా ముట్టుకున్నాను.

ఇప్పుడట్లా చెయ్యను. ఎదురుగ్గా నిలుచుని 'ఫో! పాడుపాలూ, నీ యిష్టం వచ్చినట్లు పొంగి చావు!' అనుకుంటాను. నీళ్ళు దగ్గర్లోవుంటే చల్లుతాను. లేకుంటే లేదు. పొంగు పొయ్యిలో పడి పొయ్యి ఆరిపోతే, అదేపోతుంది పొంగు!

యింతకూ ఆ వెధవ్వంటంటే నాకు సరిపడదు.మా అమ్మ నాకు నేర్పలేదు. ఆవిడ చాలా ఎన్‌లైటెండ్ మనిషి. బాగా చదువుకుంది. వంటలాంటి అల్పవిషయాలు తెలీదుగాని మిగతాగా ఆనందమయ జీవనానికి కావల్సిన గొప్ప విషయాలన్నీ తెలుసుకుంటుందామె! హ, హ, హ, చాలా తెలిసిన మనిషి మా అమ్మ!

కాని మా నాన్నని పెళ్ళి చేసుకుంది. మా నాన్న డెప్యూటీ కలెక్టరుగా చాలా ఏళ్ళు వుండి రిటైరయ్యారు. కలెక్టరుగా ప్రమోషన్ రాలేదు. ఎప్పటికైనా కలెక్టరు భార్యనౌతానని అనుకుని వుంటుంది. హ, హ, హ ఎంత తెలిసినావిడైనా ఆయన కర్మని నడిపే శక్తి లేదుగా! లంచాలు ఏమంతగా తీసుకోకపోయినా కర్మచాలక ఆ తీసుకున్న కొద్దిపాటివే బయటకొచ్చి బ్లాక్‌మార్కు పడింది పితృదేవులకు. మా అమ్మ హ, హ, అంత తెలిసీ, చదువుకొనీ, దీనికి ఏం చేస్తుంది? బ్రూటస్ పొడిచినప్పటి సీజర్‌లాగా గుండెల లోపలికి లోతుగా దెబ్బతిని వుంటుంది...తినటమూ మంచిదేనని నా ఉద్దేశం... ఎదురుదెబ్బలు తగులుతూవుంటే జ్ఞానం, వేదాంతం అన్నీ తెలుస్తాయంటారు గదా!

మమ్మల్నిద్దర్నీ-నన్నూ, సూర్యాన్నీ-చాలా జాగ్రత్తగా ఆలోచించి కన్నదికూడా. ఆవిడే చెప్పింది. 'ఫాక్ట్స్ ఆఫ్ లైఫ్'- జీవిత సత్యాలు- యుక్తవయస్సురాగానే నాకు చెప్పినప్పుడు తర్వాత సూర్యానికీ చెప్పివుంటుంది. వాడు మగవాడు ఎందుకయ్యాడో, నేను ఎందుకు కాలేదో. 'ఎఫెమినేట్' వెధవ... ఆణంగి, కోణంగి... వాడికి అమ్మ చెప్పేదాకా ఏమీ తెలిసుండదు. బుద్ధిమంతుడు వాడు. ఎప్పుడూ బుద్ధిగా చదువుకోవటమే పని. అందుకే అమ్మకీ, నాన్నకీ ముద్దులకొడుకువాడు.

అంతా హిపోక్రసీ. చదువుతప్ప ఏమీ తెలియకుండా వుండటం మంచి బుద్ధి అవుతుందా? మిగతాదంతా తప్పయినట్లు, ప్రపంచంలో ఇంకేమీ లేనట్లు! మేము ఆవిడ తల్లోంచీ పుట్టాం - తలకాయలోంచీ! ఆవిడ ఆలోచనలు వింటూంటే నాకు

వాంతికొస్తుంది! నిజంగా వస్తుంది.

లోకమంతా ప్లాను ప్రకారం నడుస్తుంది ఆవిడకి... ఇండియా పంచవర్ష ప్రణాళికల ప్రకారం నడిచినట్లు! మన గవర్నమెంటుకంటే ఆమే తెలివైంది. పెళ్లయినాక అయిదేళ్లకి నన్ను కనాలనుకుని కన్నది. తరువాత అయిదేళ్లకి వాడిని-సూర్యాన్ని కనాలనుకుని కన్నది. ఆ తరువాత వద్దనుకుని మానేసింది!

నన్నూ అట్లాగే కనమని చెప్పింది. నేను పెళ్ళి చేసుకున్నాక నేను వినినని తెలుసు. బాధ్యతవుంది గనక చెప్పింది-అసలు నేను పెళ్ళి చేసుకోవటం ఆవిడ ప్లానును భగ్నం చెయ్యాలని చేశాను... కాదు, నేను పెళ్లి చేసుకోవటం ఆవిడ ప్లానును దెబ్బతీసిందేమో... నేను యీయన్ని ఎందుకు కోరుకున్నానో నాకుమాత్రం తెలియదు. ఆయనకీ నాకూ చుక్కెదురు!

నాకు పదిహేనేళ్ళు రాంగానే ఆవిడ ఇంకా నేను పసిపిల్లనని ఫ్రాకులూ పరికిణీ చొక్కాలూ మధ్య వూగిసలాడుతుండగానే ప్రక్క యింటి మేడమీద అబ్బాయిని ప్రేమించి ఉత్తరాలు రాసేశాను. ఆయబ్బాయిని తప్ప ఇంకోళ్ళని చేసుకోనని మొండిపట్టు పట్టాను. వూరంతా గోలయిపోయి ఆవిడ దిగిరాక తప్పలేదు. అప్పటికీ చేతనయినంతా చెప్పి చూసింది. మంచి ఇంజనీరుకో, డాక్టరుకో ఇచ్చి చేస్తానంది. అప్పుడు-

"డబ్బూ, మనుష్యులూ పుష్కలంగా వుంటారు. రాజభోగం వుంటుంది. బిఏ పాసు కాలేక తప్పుతూ కట్టుతూ తప్పుతూవుండే బడుద్ధాయిని చేసుకుంటే తరువాత నానాపాట్లూ పడతావు" అన్నది.

వాకబు చేస్తే యీ అబ్బాయికి ఆస్తి కూడా లేదని తెలిసింది. అప్పుడు ఆవిడ ఆరాటం, బాధ చూస్తూంటే నాకు లోపల మహా సంతోషం కలిగింది. నా కోసరమా యీ ఆరాటం? తన తలకాయలోని కూతురికోసం, హోదాకోసం!

అంత జాగ్రత్తగా పెంచిన నేను యిట్లా తయారు కావటం ఆవిడకి అర్థం కాలేదు. ఎంత ప్లాను ప్రకారం చేసింది అన్నీ! ఫ్రాయిడ్ కాంప్లెక్సులూ, ఆడ్లర్ కాంప్లెక్సులూ అన్నీ చదివి మరీ పెంచింది. నేను చేసే ప్రతి పనికీ, మాట్లాడే ప్రతిమాటకూ వెనుక ఏ కాంప్లెక్సు వుందోనని వెతికివెతికి జాగ్రత్తపడేది. అమ్మా, నాన్నా చీకటితప్పును ఏ నిద్రలోనే గభాల్న లేచిచూస్తే... సగం నిద్రలో, మసగ్గా-అప్పుడు గొప్ప ఫ్రాయిడ్ కాంప్లెక్సు వస్తుందట. ఆ సూర్యంగాడు అట్లాగ వున్నాడేమిటని చిన్నప్పుడు నేను అడిగితే అదిరిపోయింది. తరువాత అన్నీ వివరంగా చెప్పింది. అలా పెంచింది మమ్మల్ని!

ఆఖరికి నా సంగతి బాగా తెలిసాక, ఎంతో ఆలోచించి యిదంతా ఆడ్లర్ చెప్పినట్లు మొదటి బిడ్డలకు వచ్చే 'డీత్రోన్‌మెంట్'-రాజ్యపదవీ భ్రష్టత్వం - తాలూకు

కాంప్లెక్సు అని నిశ్చయం చేసుకుంది.

"సూర్యాన్ని యింకొంచెం, ఇంకో అయిదేళ్లు ఆలస్యంగా కనివుంటే బాగుండేది. పొరపాటైపోయింది" అని నాన్నతో చెప్తుంటే విన్నాను. నాన్న ఒప్పుకున్నారు. ఒప్పుకోక ఏంచేస్తారు గనుక... కలెక్టరన్నా కాలేకపోయాక!

సూర్యంగాడు అవుతాడేమో కలెక్టరు... బుద్ధిగా చదువుకొంటున్నాడు.

మా ఆయనకు తనకు తెలిసిన వాళ్ళద్వారా కలెక్టరాఫీసులో గుమాస్తాపని ఇప్పించారు నాన్న. ఆరేళ్ళనుంచీ గుమాస్తాగా వుంటున్నారు. మొదటి రెండేళ్ళలోనే బాబీనీ, పాపనీ కనేశాను. తరువాత వోపికలేక మానేశాను. పిల్లలతో మహా చీకాకు. అమ్మా పాలు... దొడ్డికి పోయి వచ్చేశానే... ఒకటి కొస్తున్నాదే... ఇద్దరితో పడేసరికి గందరగోళమయిపోయింది. ఆయాలూ, వంటమనుషులూ వుండటానికి ఆయన కలెక్టరాఫీసులో గుమాస్తాయే గదా...

ఈసరికి ఆయన వెళ్లి ముందువాకిలి తలుపు తీసి వచ్చిఉంటారు. పనిమనిషి పాలు లోపలపెట్టి అంట్లు తోమేసి వుంటుంది.

ఈ కుడి చేతివేళ్లకి వుండే మచ్చలు ఆవిరి తగిలిన తాలూకా లేక కుష్ఠుపొడలా అని తెలియలేదు. దేవుడున్నాడా లేడా అని తెలియనట్లు. ఒక్కోరోజున అవి కుష్ఠుమచ్చలేననుకుంటాను. ఆరోజున పాలుపొంగి పోతై. చేతులుకాలి తీరతై. పిల్లలు మహా చీకాకు పెట్టి తిట్లూ దెబ్బలూ తిని ఏడుస్తూవుంటారు... వాళ్ళు ఏడుస్తే నేనూ ఏడుస్తాను. ఎందుకంటే వాళ్ళు నా దగ్గరకే వచ్చి నన్ను పట్టుకొని అమ్మా అని ఏడుస్తారు గనుక. అట్లా ఏడవటం చాలా ఉదాత్తంతా వుంటుంది గనుక...

ఒక్కోరోజు అవి ఒట్టి ఆవిరి మచ్చలే అనుకుంటాను. ఆ రోజున చాలా ఉల్లాసంగా వుంటుంది. డబ్బుంటే పిల్లలకేమైనా పిండివంట చేస్తాను. ఆయన ఆఫీసులో కష్టపడ్డందుకు సానుభూతి కూడా చూపిస్తాను. నా సానుభూతితో ఆయనకేం పనిలేదు. నేను తిట్టినా సానుభూతి చూపించినా ఒకటేగా చిరునవ్వు సమాధానం. ఏమీ తెలియదు. వట్టి గుమాస్తా!

ఇవాళ ఆ మచ్చలు కుష్ఠు పొడలాగే కనిపిస్తున్నాయి. నిన్ననే నాన్న ఉత్తరం రాశారు తిరుపతినుంచీ. దగ్గర్లోకి వచ్చాం గనుక ఒక్కసారి వచ్చి వారం రోజులుండి పొమ్మని. సూర్యంగాడు ఎంఎస్సీలో చేరాడట. హాస్టల్లో వుంటే ఆణంగి వెధవ కందిపోతాడని వచ్చారు. దీపావళి దగ్గరకొచ్చింది. ప్రతి పండగకీ రమ్మని రాస్తారు విధాయకంగా. పెళ్ళయి ఆరేళ్లవుతున్నా ఇంతవరకూ ఒక్కసారికూడా పుట్టింటికి వెళ్లలేదు నేను. నాకు బస్సులూ, రైళ్లూ ఇష్టంలేదు.

కాన్పులక్కూడా చివరిదాకా ఎట్లాగో గడిపేసి ఆసుపత్రిలో చేరి కనేసి

ఇంటికొచ్చాను. తెలిపాక మొదటిసారి అమ్మ వచ్చి పదిరోజులుండిపోయింది. రెండోసారి ఆయన స్నేహితుల తాలూకు వారం రోజుల సాయం వుండింది. అప్పట్నుంచీ మళ్లీ పని, పని. కాని నిజం చెప్పాలంటే ఆయన సగం పని చేస్తారు. అర్ధరాత్రి పిల్ల ఏడిస్తే పాలు పట్టడం, ఉచ్చగుడ్డలు మార్చటంలాంటివి. గుమాస్తా అయి చెయ్యకేం చేస్తారు...ఏం కలెక్టరా?

"అమ్మా లేమ్మా... పాలివ్వవే" బాబు గోల ప్రారంభించాడు.

నాకు పెద్ద రోగం వస్తుంటే వీడికి పాలు కావాలిట. వెధవ!

"కాసేపున్నాక ఇస్తాలే, ఫో" అన్నాను.

వీధిలోకి పరుగెట్టాడు.

అసలు యీ గోలపిల్లలు, పాడు పిల్లలు లేకుంటేనేం? న్యూసెన్సు తప్ప మరేమన్నా పాజిటివ్ లక్షణం వుందా? నాకు సగం రోగం వీళ్ళనుంచీనే పుట్టుకొస్తోంది. వాడికీ పూర్తి అటెన్షన్ కావాలి. దానికీ పూర్తి అటెన్షన్ కావాలి. వంటకీ పూర్తి అటెన్షన్ కావాలి. ఆయన గుమాస్తా గనుక అక్కర్లేదు గనుక సరిపోయింది. నేను ఒక్కదాన్ని మూడు పూర్తి అటెన్షన్‌లు ఎట్లాగ సప్లయి చేస్తాను? అదే రోగం!

ఇప్పుడు గభాల్న వీళ్ళు లేకుండాపోతే? దొంగలెత్తుకుపోతే... రోగమొచ్చిపోతే....

అప్పుడు గోలేవుండదు! ఇల్లంతా ప్రశాంతంగా వుంటుంది. నేను తొమ్మిది గంటలకు నిద్రలేస్తాను!

"ఢాం"

అబ్బ ఏమిటది? ఒళ్ళే అదిరిపోయింది. పిడుగుపడ్డదా ఏమిటి? మబ్బులూ, మెరుపులూ లేకుండానే? ఎంత పెద్ద శబ్దం!

అది కాస్తా లేచేసింది. ఇహ గోల మొదలు. ఇంకాస్సేపు నిద్రపోతే ఏం మునిగిపోతుంది?

అబ్బ ఒళ్లు అదురు తగ్గనేలేదు.

"ఏమిటండీ ఆ శబ్దం?"

"ఇదుగో చూసొస్తా... ఏదో పెద్ద టపాకాయ వేసినట్లున్నారు పొద్దున్నే"

"అమ్మా, అమ్మా... పిల్లకాయలు డబ్బాలో మందుపొడి పెడితే పేలిపోయిందట. మనవాకిటిముందే... నలుగురో ఏమో పొయ్యారంటుండారు" పనిమనిషి లక్ష్మి.

"నాగుండె అదిరిపోయిందే!... మన వాకిటిముందేనా?"

"మన బాబిగాడేడీ, రాధా?"

"అయ్యో, అయ్యో, వాడు బయటికి పోయాడండీ. అట్లా చూడండీ... లక్ష్మీ, పోయిరావే... అయ్యో నా నాయనా, నా బంగారు స్వామీ... నా చందమామా..."

"వుండు వుండు నేను చూసొస్తాను... ఖంగారుపడకు" ఆయన కంగారుగా బయటికి వెళ్తున్నారు...

"అమ్మా, బయటే... వాళ్లు వచ్చిపోయారే" బాబిగాడు భయపడి లోపలికి వచ్చాడు.

"వెధవా నన్ను వూరికే హడలగొడితివిగదరా... నిన్ను చంపేస్తానుండు..." వాడిని చంపటానికి పక్కమీదినుంచీ లేచాను.

ఆయన వచ్చి పట్టుకున్నారు. "రాధా వూరుకో... వాడసలే భయపడి పోయివుంటే..."

ఆయన భుజమ్మీద వాలిపోయాను. వూరికే ఏడుపొచ్చింది... ఆపుకోలేకుండా...

ఆయన నా వీపుమీద చిన్నగా తట్టి "కాసేపుకూర్చో... అదే పోతుంది... భయపడ్డావు" అన్నారు.

"కాదండీ... నాకు... నాకు... చేతివేళ్లకు మచ్చలు వచ్చాయండీ... కుష్ఠురోగమో ఏమో" అంటూ ఏడిచాను.

"డాక్టరు దగ్గరకు పోయి చూపెట్టుకుందాంలే... ఏడవబోకు... వూరికే భయపడితే ఎట్లా?..." అన్నారు.

వెంటనే భయపడి దూరంగా జరగటంకూడా తెలియదు. పట్టి గుమాస్తా...!

★★★